# భూసాంద్రత పరీక్ష కీలకం

విజయవాడ (లబ్బీపేట):

నవ్యాంధ్ర రాజధాని అమరావతి ప్రాంతం కృష్ణా నది చెంతనే వున్నందున, అక్కడ చేపట్టే నిర్మాణాల్లో భూసాంద్రత పరీక్ష కీలకమని ప్రీ ఇంజినీర్స్ స్ట్రక్చర్స్ సొసైటీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు, సత్యవేణి ప్రాజెక్ట్స్ అండ్ కన్సల్టెంట్స్ మేనేజింగ్ డైరెక్టర్ పి.సూర్యప్రకాశరావు పేర్కొన్నారు. భూ సాంద్రత ఆధారంగానే నిర్మాణం చేపట్టే భవనాలకు ఫౌండేషన్ వేయాల్సి వుంటుందన్నారు. అమరావతి రాజధాని నిర్మాణం నేపథ్యంలో వేగవంతంగా భవన నిర్మాణాలు చేపట్టడం ఎలా అనే అంశంపై శుక్రవారం జాతీయస్థాయిలో వర్క్‌షాపు నిర్వహించారు. సత్యవేణి ప్రాజెక్ట్స్ అండ్ కన్సల్టెంట్స్, ప్రీ ఇంజినీర్స్ స్ట్రక్చర్స్ సొసైటీ ఆఫ్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో ఈ వర్క్‌షాపు నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యప్రకాశరావు మాట్లాడుతూ రాజధాని అమరావతి ప్రాంతం కృష్ణా నది ఒడ్డున ఉన్నందున భూమి అనేక పొరలుగా ఉండే అవకాశం ఉందన్నారు. ముందుగా సాయిల్ పరీక్ష చేసి, దానికనుగుణంగా ఫౌండేషన్ ఎలా వేయాలనేది నిర్ణయించాల్సి ఉంటుందన్నారు. భూ సాంద్రత పరీక్ష చేయకుండా భవన నిర్మాణాలు చేపడితే అవి కొంత కాలానికి ఒకవైపునకు వంగిపోవడం వంటివి జరుగుతాయన్నారు. ప్రముఖ ఇంజినీర్ టి.రాంబాబు, ఐఐటీ ప్రొఫెసర్ వీఎస్ రాజు మాట్లాడుతూ నల్లరేగడి నేల రైతులకు వరమైతే, ఇంజినీర్లకు శాపమన్నారు. ఈ భూమిలో నిర్మాణాలు చేపట్టే సమయంలో తగుజాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం వేగవంతంగా భవనాలు పూర్తిచేసేందుకు ప్రీ కాస్ట్ మెటీరియల్ అందుబాటులో ఉన్నట్లు తెలిపారు. నవాంధ్ర రాజధానిని పురస్కరించుకుని నరసరావుపేట ప్రీకాస్ట్ కంపెనీ ఏర్పాటు చేయనున్నట్లు వారు తెలిపారు. వర్క్‌షాపులో అమరావతి నిర్మాణంలో చేపట్టనున్న భారీ నిర్మాణాలను భూ సాంద్రత, ఏవిధమైన పునాదులు వేయాలి, ప్రీ కాస్ట్ ప్రాధాన్యత, భూకంపాలను తట్టుకునే విధంగా భవన నిర్మాణాలను ఎలా చేపట్టాలనే అంశాలపై విశ్లేషణాత్మక చర్చ నిర్వహించారు. వర్క్‌షాపులో హెచ్‌బీఎల్ కంపెనీ ప్రతినిధి, సురేంద్ర బిల్డర్స్, ప్రభుత్వ భవన నిర్మాణ విభాగాధిపతులు, ఇంజినీరింగ్ కళాశాలల ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

- ప్రీ ఇంజినీర్స్ స్ట్రక్చర్స్ సొసైటీ అధ్యక్షుడు సూర్యప్రకాశరావు
- వేగంగా భవన నిర్మాణాలపై జాతీయస్థాయి వర్క్‌షాపు



వర్క్‌షాపులో మాట్లాడుతున్న సూర్యప్రకాశరావు